- జిల్లాలో 'ధరణి' సమస్యలకు పరిష్కారం చూపేనా?
- ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలు
- ఇప్పటికే పెండింగ్‌లో 13వేలకు పైగా దరఖాస్తులు
- ధరణి లోటుపాట్లను సవరించేందుకు ఆర్‌వోఆర్ చట్టం
- ఇటీవల భూభారతికి గవర్నర్ గ్రీన్ సిగ్నల్
- మార్గదర్శకాలపై రైతుల్లో నెలకొన్న ఆసక్తి
- జిల్లావ్యాప్తంగా మొత్తం 50,494 దరఖాస్తులు రాగా.. ఆమోదం పొందినవి 34,503



భూభారతితో.. చిక్కులు తొలిగేనా!?

కామారెడ్డి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): భూ వివరాలు పారదర్శకం, సమస్యల పరిష్కారానికి సులువైన మార్గం అంటూ గత ప్రభుత్వం 2019లో ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చిన విషయం తెలిసిందే. భూముల క్రయవిక్రయాలతో పాటు రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండేలా ఆ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు భూ సమస్యలు పరిష్కారం అవుతాయని భావించిన రైతాంగానికి కొత్తచిక్కుల ఎదురయ్యాయి. చాలా గ్రామాలలో భూ సమస్యలు పరిష్కారం దొరకక గొడవలు చెలరేగాయి. పలువురు కేసుల్లో ఇరుక్కుని నానా ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. మండల, తహసీల్దార్ కార్యాలయాలు, పోలీసుస్టేషన్‌లకు వస్తున్న ఫిర్యాదులలో భూ సమస్యలు, వివాదాలపైనే ఎక్కువగా ఉంటుండడం గమనార్హం. అదేవిధంగా ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి సైతం భూ సమస్యలపైనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువస్తున్న భూ భారతీతోనైన భూ సమస్యల చిక్కులు తొలుగుతాయని బాధిత రైతులు ఆశలు పెట్టుకుంటున్నారు.



పరిష్కారానికి నోచుకోని దరఖాస్తులు

గత ప్రభుత్వం 8ఏళ్ల కిందట తీసుకువచ్చిన ధరణి భూ సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కావడం లేదు. జిల్లావ్యాప్తంగా ధరణికి భూ సమస్యలపై 50,494 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 34,503 దరఖాస్తులు ఆమోదం పొందినవి ఉన్నాయి. 10,700 దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరించారు. మరో 3,271 దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ధరణి పోర్టల్‌లో పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి కచ్చితమైన ఆప్షన్‌లు లేకపోవడం, క్షేత్రస్థాయి విచారణకు సిబ్బంది కొరత సమస్యగా మారిందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. సాంకేతిక చిక్కుల పరిష్కారానికి ఎన్నో ఆప్షన్‌లను ప్రవేశపెట్టినప్పటికి మూడు కేటగిరిలలో నమోదైన దరఖాస్తులు అత్యధికంగా తిరస్కరణకు గురవుతున్నాయి. జిల్లాలో ఇదే పరిస్థితి నెలకొంటుంది. గతానికి భిన్నంగా దరఖాస్తులు తహసీల్దార్ నుంచి ఆర్డీఓకు ఆ తర్వాత అదనపు కలెక్టర్, కలెక్టర్ లాగిన్‌కు చేరాల్సి ఉండేది. దీంతో దరఖాస్తుల పరిష్కారంలో కొంత మేర జాప్యం జరుగుతూ వచ్చింది. మూడు స్థాయిలో నోట్‌ఫైల్ సిద్ధం చేయడం, సెద్వార్, కాస్రాపహణీలతో పాటు ఆర్ఎస్ఆర్ రిజిస్టర్‌లు పరిశీలించాల్సి వచ్చేది. దీంతో పలు దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశిలించే సిబ్బందికి అవగాహన,అవసరమైన రికార్డులు అందుబాటులో లేకపోవడంతో అధికసంఖ్యలో తిరస్కరణకు గురవతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆర్‌వోఆర్ చట్టానికి సన్నాహాలు

ధరణి పోర్టల్‌ను భూభారతిగా మార్చడంతో పాటు కొత్త ఆర్‌వోఆర్ చట్టం అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఆర్‌వోఆర్ చట్టం అమలు కోసం శాసనసభలో ప్రభుత్వం ప్రకటించింది. అసెంబ్లీ ఆమోదం తెలిపిన తర్వాత చట్టంగా మారింది. దీంతో చట్టం అమలుకై ఇప్పటికే ప్రజలు, రైతుల నుంచి అభిప్రాయాల స్వీకరించారు. ఆర్‌వోఆర్ చట్టాన్ని అమలులోకి తీసుకుని వచ్చేందుకు రెవెన్యూ అధికారులకు సైతం అవగాహన కల్పించారు. ఈ చట్టం అమలుతో పాటు రెవెన్యూ గ్రామానికి ఒక అధికారిణి నియమించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన వేగవంతం అవుతుందని అన్ని వర్గాల వారు ఆశభావం వ్యక్తం చేస్తున్నారు.

పటిష్టం కానున్న రెవెన్యూ వ్యవస్థ

గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌తో పాటు రెవెన్యూ

(తరువాయి 8వ పేజీలో...)

ఫటా..ఫట్...

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి

● రఘురాం, ఎంపీడీవో, రాజంపేట



ఆంధ్రజ్యోతి: మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఎంత వరకు పూర్తయ్యింది?

అధికారి: మండలంలోని గ్రామాల్లోని జనవరి 4వ తేదీ వరకు పూర్తి చేశాం.

ఆంధ్రజ్యోతి: ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఇళ్లు లేనివారికి తెల్లరేషన్ కార్డు ఉండాలా?

అధికారి: సర్వేలో తెల్ల రేషన్ కార్డులతో సంబంధం లేదు. పంచాయతీ కార్యదర్శులతో సర్వే చేసి ఆన్‌లైన్ నమోదు చేశాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో ఎన్ఆర్‌జీఎస్‌లో సంవత్సరానికి ఎన్ని మొక్కలు నాటుతున్నారు?

అధికారి: గ్రామాల్లో ఎన్ఆర్‌జీఎస్ ద్వారా ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో నాలుగు వేల మొక్కలు నర్సరీ ద్వారా అందించడంతో పాటు నాటిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో ఎన్ని డంపింగ్ యార్డ్‌లు ఉన్నాయి. ఎన్ని వినియోగంలో ఉన్నాయి?

అధికారి: మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డ్‌లు, కంపోస్ట్ షెడ్‌లు వినియోగంలో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: మండలంలోని ఎన్ని క్రీడా మైదానాలు వినియోగంలో ఉన్నాయి?

అధికారి: మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో క్రీడా ప్రాంగణాలు వినియోగంలో ఉన్నాయి. ఎల్లపూర్ తండా గ్రామ పంచాయతీలో ప్రభుత్వ భూమి లేనందున ఇంకాపూర్తి కాలేదు. వాలీబాల్, టెన్నికైట్, స్కిపింగ్, తదితర వస్తువులను అందుబాటులో ఉంచాం.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో ఉపాధి హామీ వంద రోజుల పని పూర్తి చేశారా? కూలీలకు డబ్బులు పడుతున్నాయా?

అధికారి: ప్రతీ గ్రామంలో వంద రోజుల పనులు పూర్తి చేశాం. డబ్బులు కూలీల ఖాతాల్లో తక్కువ సమయంలో జమ అయ్యాయి. మండలంలోని ఆరేపల్లి గ్రామంలో పారంపడు తవ్వించాం. రైతులు దానిని ఉపయోగించుకోవాలంటే పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలి.

(- రాజంపేట,ఆంధ్రజ్యోతి)



...హైదరాబాద్‌లో కలెక్టర్లతో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



అధికారులతో మాట్లాడుతున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

నవోదయ ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు : అదనపు కలెక్టర్

కామారెడ్డి టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశపరీక్ష నిర్వహణకు పగడ్బంది ఏర్పాట్లు చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రవేశపరీక్ష కోసం లైన్‌డిపార్ట్‌మెంట్స్‌లో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18న నవోదయ విద్యాలయంలో ఆరోతరగతిలో ప్రవేశం కోసం నిర్వహించే పరీక్షకు జిల్లాలో 14 సెంటర్లను ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. ప్రతి సెంటర్ చీఫ్ సూపరిటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్, ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. ప్రతి సెంటర్‌లో విద్యార్థులకు సౌకర్యంగా త్రాగునీరు ఏర్పాటుచేయాలని తెలిపారు. ఉదయం 11.30 నుండి 1.30 వరకు ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖాధికారులు

రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

కామారెడ్డి టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు రోడ్డుభద్రతపై అవగాహన కలిగి ఉండాలని ఎంవీఐ నాగలక్ష్మీ అన్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లాకేంద్రంలోని ఆటోడ్రైవర్లకు రోడ్డుభద్రత మసోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం చేపట్టి ఆటోలకు రోడ్డుభద్రతకు సంబంధించిన పోస్టర్‌లను అంటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారులందరూ భద్రత నియమాలు పాటించాలని తెలిపారు. ఆటో డ్రైవర్‌లు సైతం ప్రయాణికులను తీసుకెళ్తున్నప్పుడు నిబంధనల మేరకు నడుచుకోవాలని, అధికంగా ఎక్కించుకుని తీసుకువెళ్లే ఏదైన ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏంవీఐలు శ్రీనివాస్,సహాయ మోటార్ వాహన తనిఖీ అధికారి భిక్షపతి, ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్స్, హోంగార్డులు పాల్గొన్నారు.

యంగ్ ఇండియా వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

భిక్కనూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో యంగ్ ఇండియా కే బోల్ సీజన్-5 వాల్‌పోస్టర్లను శుక్రవారం యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గొప్పతనాన్ని భావితరాలకు అందించాలన్ని ఉద్దేశంతో పాఠశాలల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాటిపాముల లింబాద్రి, దయాకర్‌రెడ్డి, మద్దూరి రవి, మహిపాల్‌రెడ్డి, అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా వైకుంఠ ఏకాదశి

● వేకువజాము నుంచే ప్రధాన ఆలయాలకు పోటెత్తిన భక్తులు ● ఉత్తర ద్వార దర్శనం కోసం ప్రత్యేకంగా క్యూలైన్ల ఏర్పాటు

కామారెడ్డి టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ఆయా ఆలయాలలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామి,గోపాల స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి అర్చనలు చేశారు. ఉదయం 3.30 నుంచి భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తరద్వారా దర్శనంతో గోపాలస్వామి ఆలయం వద్ద భక్తుల క్యూ భారీగా చేరింది. ఆలయం నుంచి అరకిలోమీటర్ మేర క్యూలైన్‌లో భక్తులు నిల్చుని మొక్కులు చెల్లించుకున్నారు.వెంకటేశ్వర స్వామి ఆలయంలో సైతం భక్తుల రద్దీ బాగానే పెరిగింది.

దోమకొండ: మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయం, సంగమేశ్వర్‌లోని వెంకటేశ్వర ఆలయం గొట్టిముక్కుల గ్రామంలోని శివాలయం, హనుమాన్ మందిర్ ఆలయాల్లో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకల సందర్భంగా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఉత్తర ద్వారా దర్శనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



పట్టణంలోని గోపాలస్వామి రోడ్డులో భారీ క్యూలైన్



● తిరుమలలో ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతరావు

వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే తోట

పెద్దకొడప్‌గల్: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంతారావు తిరుమలలో వేంటకేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీవీఐపీ సేవ దర్శనంలో భాగంగా ఎమ్మెల్యే వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట మాట్లాడుతూ ఈ సంవత్సరం రాష్ట్రంలో మంచి వర్షాలు కురవాలని, రాష్ట్రంలోని ప్రజలంతా సుఖసంతోషాలలో ఉండాలని కోరుకున్నామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

టీటీడీలో ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

బీర్కూర్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా వైష్ణవ ఆలయాలు భక్తుల తాకిడితో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాల దగ్గర బారులు తీరారు. ఉత్తర ద్వారం గుండా విష్ణు మూర్తిని దర్శించుకున్నారు. స్వామి వారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి రోజున విష్ణువును దర్శించుకుంటే వైకుంఠ ప్రాప్తి లభిస్తుందని భక్తుల నమ్మకం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అలయ కమిటీ సభ్యులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. బైరాపూర్‌లోని రుక్మిణి విఠలేశ్వర ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చి ఉత్తర ద్వారం గుండా విఠలేశ్వర స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



జిల్లాకేంద్రంలో పూజలు అందుకుంటున్న స్వామివారు

పిట్లం: స్థానిక వేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం అంగరంగ వైభవంగ వైకుంఠ ఏకదశి వేడుకలు కన్నుల పండువగా కొనసాగినాయి. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల దర్శనం కోసం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్లు చేశారు. భక్తులు ఉదయం నుంచి ఆలయానికి చేరుకొని ఉత్తర ద్వారం గుండా వేంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.



టీటీడీలో స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పోచారం



పిట్లంలో వేంకటేశ్వర ఆలయంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే



దోమకొండ లక్ష్మీనారాయణ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

దోమకొండలో ఉపాధి హామీ ప్రజావేదిక

దోమకొండ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 15వ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏపీడీ వామన్‌రావు డీఆర్‌పీలు గ్రామాల్లో నిర్వహించిన వివరాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని తొమ్మిది గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు చేపట్టిన పనుల వివరాలు, గ్రామాల్లో నిర్వహించిన అభివృద్ధి పనులకు సంబంధించి ఆయా గ్రామాల డీఆర్‌పీలు సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో నర్సింగ్ ఎంపీడీవో చిన్నారెడ్డి, ఏపీవో రజని, కార్యదర్శులు యాదగిరి, రమేష్, అంజయ్య, భానుశ్రీ, అరుణ, అఖిల, రాహుల్‌గౌడ్, రాజశేఖర్, పద్మ, వసంత, సౌందర్య, శ్రీనివాస్, పీల్డ్ అస్టిసెంట్‌లు కర్రోల్ల అంజాగౌడ్, పరుశరాంగౌడ్, లింగం, రత్నకర్, యాదవరెడ్డి, శంకర్, సత్యం, బాల్‌నర్సు, డీఆర్‌పీలు మహేష్, జైపాల్, సౌజన్య, సబిత, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న ఎంపీడీవో

మోడల్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం

నవీపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో చేరడానికి 100 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్లకు సైతం అడ్మిషన్లు తీసుకోవడానికి ఈ నెల 6 నుంచి వచ్చే నెల 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నామని ఆయన వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎడపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎడపల్లి ఏడీఈ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఎడపల్లి సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎడపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని బోధన్ రూరల్‌లోని కల్దుర్కి, ఎరాజ్‌పల్లి, ఊట్‌పల్లి, ఎడపల్లి మండలంలోని శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5గంటల వరకు రెంజల్ మండలంలోని రెంజల్‌లో మాత్రం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

ఆర్మూర్‌టౌన్: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్‌లో అంతరాయం ఏర్పాడుతుందని పెర్కిట్ ఏఈ మౌనిక తెలిపారు. మండలంలోని పెర్కిట్, మామిడిపల్లి, గోవింద్‌పేట్, కోమన్‌పల్లి, సుర్బిర్యాల్ గ్రామాల్లో శనివారం సబ్‌స్టేషన్ పనుల నిమిత్తం మధ్యాహ్నం 3నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో ఉండదని ఈ విషయాన్ని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు సహకరించాలన్నారు.

జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య

రుద్రూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన రుద్రూరులో చోటు చేసుకుంది. రుద్రూరు ఎస్ఐ సాయన్న తెలిపిన వివరాల ప్రకారం రుద్రూరు గ్రామానికి చెందిన నేకంటి శారద(34)అను మహిళ కడుపు నొప్పి, ఫిట్స్‌తో బాధపడుతూ అనారోగ్యం కారణంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉదయం రుద్రూరు గ్రామ శివారులో ఉన్న చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుందన్నారు. మృతురాలు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

యువకుడి ఆత్మహత్య

రాజంపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్గొండ గ్రామంలో చౌదరి రాజశేఖర్ గురువారం రాత్రి బసవేశ్వర ఆలయ సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నట్లు ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. కొన్నేళ్ల క్రితం దుబాయికి వెళ్లిన రాజశేఖర్ అక్కడ పరిస్థితులు బాలేక తిరిగి స్వగ్రామానికి రావడంతో చేసిన అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో హైదరాబాద్‌లో ప్రైవేట్ జాబ్‌చేస్తు నాలుగు రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. అప్పుల ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్థాపం చెంది చెట్టుకి ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నట్లు తెలిపారు. మృతుడి తండ్రి సిద్దిరాములు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసిదర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

దోమకొండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన సంఘటన శుక్రవారం దోమకొండ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండకు చెందిన సామల భరత్ కుమార్(34) ఈ నెల 6న రాత్రి అందదా 9 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఏదో గుర్తు తెలియని పురుగుల మందు తాగి కింద పడిపోగా అతని కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని కామారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కొరకై హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై తెలిపారు.

ఉరి వేసుకుని ఒకరు..

దోమకొండ, జనవరి 10(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రానికి చెందిన గొర్ల చంద్రయ్య(63) శుక్రవారం మధ్యాహ్నం తన గొర్రెల కొట్టంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి తెలిపారు. మృతునికి గత సంవత్సరం నుంచి కిడ్నీ సమస్యతో చికిత్స పొందుతూ డయాలసిస్ చికిత్స తీసుకుంటున్నాడని చంద్రయ్య జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పేలిన ఫ్రిజ్.. తప్పిన ప్రమాదం

దోమకొండ, జనవరి 10(ఆంధ్రజ్యోతి):మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ఒక ఇంట్లో ఫ్రిజ్ పేలింది.ఫ్రిజ్ పేలిన గదిలో ఎవరు లేకపోవడంతో ముప్పు తప్పినట్టయింది. పక్క గదిలో ఉన్న మహిళలు గమనించి అప్రమత్తమై వెంటనే స్థానికుల ద్వారా విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్‌లో విషయం తెలియజేయడంతో వెంటనే గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. విద్యుత్ సరఫరా నిలిపేంత వరకు ఫ్రిజ్ వద్ద పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. కాలనీ వాసులు గదిలో ఉన్న గ్యాస్ సిలిండర్‌ను అతి కష్టం మీద బయటకు తీసుకువచ్చారు. విద్యుత్ శాఖ హెల్పర్ రాజు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు

నాగిరెడ్డిపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని బంజార గ్రామం వద్ద హైదరాబాద్ - బోధన్ ప్రధాన రహదారిపై శుక్రవారం సాయంత్రం ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొని ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మాసన్‌పల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి, మండల కేంద్రం నుంచి మాసాన్ పల్లికి బైక్‌పై వెళుతుండగా, జప్తి జనకంపల్లి గ్రామానికి చెందిన సొల్లు రాములు, అదే గ్రామానికి చెందిన సమతలు బైక్ పైన మండల కేంద్రానికి వస్తుండగా బంజార గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై మల్లారెడ్డి క్షతగాత్రులను 108లో మెదక్ ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు.

చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

ఆర్మూర్‌టౌన్, జనవరి10(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి లక్ష్మీనర్సింహ వైన్స్ చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ బైపాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక కారులో ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోతుండగా వారిని పట్టుకొని విచారించగా బుధవారం రాత్రి లక్ష్మీనర్సింహ వైన్స్‌షాప్‌లో దొంగతనంకు పాల్పడినట్టు ఒప్పుకున్నారని ఆయన తెలిపారు. ఆదిలాబాద్‌కు చెందిన చౌహన్ రవి, షేక్ సుబ్, గణేష్‌పండగలేలను అరెస్టు చేసి వారి వద్ద ఉన్న ఒక కారు, రెండు పల్సర్ బైక్‌లు, రూ.2వేల నగదు, ఒక విస్కీ బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. కేసును చేధించిన ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, ఎస్సై గోవింద్, హెడ్‌కానిస్టేబుల్ తిరుపతిలను అభినందించి అవార్డులను అందజేశారు. అడిషనల్ డీసీపీ వెంట ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



రమా సత్యనారాయణ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



కమ్మర్‌పల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి అలంకరణ



ఆలయంలో బారులు తీరిన భక్తులు

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి

నవీపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవీపేటలోని దర్యాపూర్ శ్రీ వెంకటేశ్వర ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు ఉత్తర ద్వారం ద్వారా ఆలయంలోకి ప్రవేశించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఆర్మూర్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచే మహిళలు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకొని పూజలు నిర్వహించారు. కొటార్మూర్‌లోని విశాఖనగర్‌లో శ్రీరామ సత్యనారాయణ స్వామి ఆలయంలో వైభవంగా పూజలు నిర్వహించి భక్తులకు ఉత్తరద్వార దర్శనం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు విశాఖ గంగారెడ్డి, కాలనీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: మండల కేంద్రంలో రామాలయం, నర్సింహ స్వామి ఆలయం, అన్నారం వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించారు. రంగురంగుల విద్యుత్‌దీపాల పుష్పాల అలంకరణతో ఆలయాలను చక్కగా వెలిగిపోతూ ఆధ్యాత్మిక శోభతో కళకళ లాడాయి. పవిత్ర పర్వదినం కావడంతో భక్తులు తమ దైవాన్ని దర్శించు కునేందుకు శుక్రవారం ఉదయం దేవాలయాలకు వెళ్లారు.

పెర్కిట్: పట్టణంలోని వెంకటేశ్వరకాలనీలో గల లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం, సిద్దులగుట్టపై గల రామాలయంలో, జిరాయత్‌నగర్‌లోని రామాలయంలో భక్తులు ఉత్తరద్వారం గుండా స్వామివారిని దర్శించు కున్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని వైష్ణవ ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజాకార్యక్రమాల అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం లభించగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. రాష్ట్రంలో ఉన్న ముడు శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆల యాల్లో ఒకటిగా ఉన్న అత్యంత పురాతనమైన మహిమాన్వితమై చౌట్‌పల్లిలో శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయాలో స్వామివారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి అర్చనలు విశేషంగా జరిపారు. గరుడ సేవపై స్వామివారి ఉత్సవ మూర్తులను వేంచేయింపజేసి ఆల య అర్చకులు సముద్రాల అమర్‌నాథ్‌చార్యులు పుష్పాలలతో అలంకరించి ప్రత్యేక అర్చనలు చేశారు. చౌట్‌పల్లి సహా కోనాసముందర్, బషీరాబాద్ గ్రామాల్లోని శ్రీలక్ష్మీవెంటేశ్వర ఆలయాల్లో భక్తులు వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా ఉత్తర ద్వార దర్శనాలు చేసుకుని తరించారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని వెంకటేశ్వర దేవాలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశ పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజాము నుంచి దేవాలయంలో ప్రదక్షిణాలు చేసి ఉత్తరద్వారం ద్వారా వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

ముప్కాల్: మండలంలోని వెంచి ర్యాల్, వేంపల్లి, నల్లూర్ గ్రామాల్లోని వెంకటేశ్వరస్వామి ఆ లయాల్లో స్వామివారికి భక్తులు అభిషేకం, అర్చన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయాలు పూలతో అలం కరించారు. ప్రత్యేకంగా ఏర్పాటు ఉత్తరద్వారం నుంచి ఉత్సవమూర్తులను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరి మొక్కులు తీర్చుకున్నారు.

గోవింద నామస్మరణతో సకల శుభాలు

బోధన్‌రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గోవింద నామ స్మరణతో సకల శుభాలు కలుగుతాయని కలియుగ దైవం ఏడుకొండల స్వామిని నిత్యం స్మరిస్తే సకల శుభాలు కలుగుతాయని వెంకటేశ్వర ఆలయ వేద పండితులు అన్నారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా బోధన్ పట్టణంలోని వెంకటేశ్వరాలయం, శ్రీనివాస్‌నగర్‌లోని వెంకటేశ్వర ఆలయంతో పాటు ఆలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. ఈసందర్భంగా ఆలయ వేద పండితులు మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని, కరోనా వంటి మహమ్మారి రావొద్దని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకి సేవ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెట్రోలు బంకులో కల్తీ ..వాహన దారులు ఆగ్రహం

పిట్లం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక హెచ్‌పి పెట్రోలు పంపులో నీరుతో కూడిన పెట్రోలు రావడంతో వాహన దారులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పెట్రోలు బంకులో కౌలాస్ గ్రామానికి చెందిన ఉస్మాన్ తన వాహనంలో పెట్రోలు అయిపోవడంతో వెంటనే పెట్రోలు బంకులోనికి డబ్బాతో వెళ్ళగ, నీటి రంగుతో కూడిన పెట్రోలు రావడంతో సిబ్బందిని వాహన దారులు అందరు కలిసి ఇదేం కల్తీ పెట్రోలు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత శాఖల అధికారుల తనిఖీలు కరువై పంపులలో ఇష్టారాజ్యంగా కల్తీ పెట్రోలు దందా కొనసాగుతుందని వాహన దారులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంపు నిర్వాహకులపై చర్యలు తీసుకొవాలని డిమాండ్ చెశారు.

ప్రభుత్వ పాఠశాలలో దొంగతనం

భీమ్‌గల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని బా పూజీనగర్ కాలనీలో ఎంపీపీఎస్ పాఠశాలలో గురువారం రాత్రి గుర్తుతెలియని దొంగలు సౌంసంగ్ ట్యాబ్, 25 కిలోల బియ్యం, నాలుగు భోజనం గిన్నెలు దొంగిలించారని పాఠశాల హెచ్‌ఎం శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్టు ఎస్సై మహేష్‌కుమార్ తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

ఆర్మూర్‌టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్దులగుట్ట వెనుక టీచర్స్‌కాలనీలో జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితులను పట్టణంలోని దోబిఘాట్ వద్ద అరెస్టు చేసినట్టు అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాత సామాన్లు ఎరుకుంటూ జీవనం గడుపుతున్న మైలారం సోమేష్‌ను బుధవారం అర్ధరాత్రి కనపర్తి సత్యనారాయణ, రాజు, బడే రవిలు కలిసి సోమేష్ నిద్రిస్తున్న సమయంలో వెదురుబొంగు కట్టెతో కొట్టి కత్తెరతో పొడిచి చంపినట్టు నిందితులు ఒప్పుకున్నారని, కేసును చేధించిన ఎస్‌హెచ్‌వో సత్యనారాయణతో పాటు పోలీస్ సిబ్బందిని అడిషనల్ డీసీపీ అభినందించి రివార్డులు అందజేశారు. ఆయన వెంట ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రామన్నపేట్ వీడీసీ కార్యవర్గం ఎన్నిక

వేల్పూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేట్ గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీడీసీ అధ్యక్షుడిగా గుమ్ముల కిషన్, ఉపాధ్యక్షునిగా రాజరాపు రాజేశ్వర్, క్యాషియర్‌గా పిప్పెర లింబాద్రి, సబ్‌స్టేషన్ అధ్యక్షులుగా ఏలుక హరిష్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు.

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో పూలే అవార్డుల ప్రదానం

వేల్పూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల పీఆర్‌టీయు టీఎస్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోడ దేవనందం, సీవీ.నర్సింహరావు ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రి బా యి పూలే జయంతి సందర్భంగా ఉపాధ్యాయలను పూలే అవార్డు ప్రధానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మండల విద్యాధికారిణి తాళ్ల రేణుక, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజన్నలు ఉత్తమ మహిళ ఉపా ధ్యాయులు రేణుక, సరస్వతి, గంగామణి, జ్యోతిలను అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సావిత్రిబాయిపూలే చూపిన మార్గంలో మహిళా ఉపాధ్యాయులందరు నడవాలని, ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ కాంతయ్య, హరిచరణ్, గంగాధర్, దేవిరాజ్, విజయ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్, రాజేందర్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శులు దత్తప్రసాద్, చంద్రదేవ్, శ్రీదేవి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల అసోసియేట్ అధ్యక్షుడు రాజేంద్ర పాల్గొన్నారు.

మంగి రాములు మహరాజ్‌కు సన్మానం

నందిపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీ అండల్ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ కేదా రేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ మంగి రాములు మహరాజ్ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగి రాములు మహరాజ్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బైండ్ల ప్రశాంత్, తుక్కన్న, గంగాధర్ తదితరులు ఉన్నారు.

మండల క్రీడల్లో సత్తాచాటిన పడిగెల విద్యార్థులు

వేల్పూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయి ప్రాథమిక పాఠశాలల క్రీడల్లో పడిగెల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తమ సత్తా చటారు. మండల స్థాయి క్రీడల్లో పడిగెల గ్రామ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆరు షీల్డ్‌లను సాధించి ఓవరల్ చాంపియన్‌షిప్‌గా నిలిచారు. కబడ్డీ, ఖోఖో, పరుగుపందెం, స్కిపింగ్, తదితర క్రీడల్లో రాణించారు. ఈ సందర్భంగా షీల్డ్, బహుమతులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామంలోని ప్రధాన వీధులగుండా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. తమ పాఠశాల విద్యార్థులు మండలస్థాయి క్రీడల్లో ఓవర్ చాంపియన్‌షిప్‌గా నిలవడం పట్ల విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయురాలు సరోజిని ఉపాధ్యాయులు శంకర్, రాకేష్, నాగరాజు, ప్రవీన్, అజయ్, రేణుక, భార్గవిలు అభినందించారు.

సదర్ కేంద్రానికి బాలిక తరలింపు

బోధన్‌రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బోధన్ బస్టాండ్ ప్రాంగణంలో 11ఏళ్ల బాలిక ఒంటరిగా ఉండడాన్ని గమనించిన పీఎల్‌వీ పద్మాసింగ్, రమణ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ స్వరూప బాలికను గమనించి పిలిచి మాట్లాడారు. బాలిక విషయాలు ఆరా తీయగా తన పేరు సావిత్రి అని తన నాన్న పేరు పోశెట్టి అని నివాసం కోటగిరి అని తెలిపిందని పద్మాసింగ్ తెలిపారు. బాలిక తల్లి మృతి చెందిన తర్వాత నాన్న మరో వివాహం చేసుకున్నాడన్నారు. నాన్న మానసిక రుగ్మత వల్ల ప్రస్తుతం ఏటో వెళ్లిపోయాడని తెలిపారు. తన పిన్ని తనను హింసిస్తూ బాధపెడుతూ డబ్బులు కోసం అడుక్కు రమ్మని ఆదేశిస్తుందని రోదిస్తూ తెలిపిందన్నారు. తన పిన్ని ఇంటి నుంచి పంపించడంతో ఇరుగు పొరుగు వారు బోధన్ ఆర్టీసీ బస్సు ఎక్కించారన్నారు. విషయం తెలుసుకున్న పీఎల్‌వీ పద్మాసింగ్ బృందం బస్టాండ్ చేరుకుని బాలికలను గమనించి పూర్తి వివరాలు సేకరించి బోధన్‌లో ఉన్న సదర్ కేంద్రంలో రక్షణ కోసం తీసుకెళ్లామన్నారు.

నూతన గోదాం నిర్మాణానికి భూమిపూజ

సాలూర, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో నూతన గోదాం నిర్మాణానికి డీసీసీబీ డైరెక్టర్, సొసైటీ చైర్మన్ గిర్ధావర్ గంగారెడ్డి భూమి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గోదాం నిర్మాణ స్థలంలో ముళ్ల పొదలను తొలగించి జేసీబీతో శుక్రవారం భూమి పదును కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్దాపూర్ సొసైటీ పరిధిలోని రాజీవ్‌నగర్ తండా, ఊట్‌పల్లి, ఏరాజ్‌పల్లి, అమ్దాపూర్ తదితర గ్రామాల రైతులకు ఈ గోదాం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వివిధ గ్రామాల చిన్న, సన్నకారు రైతులు వడ్లు ఆరబెట్టుకోవడానికి ప్లాట్‌ఫామ్ నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి రాజేశ్వర్, సొసైటీ వైస్ చైర్మన్ తిర్మలేష్, డైరెక్టర్లు పోతన్న, చిన్న సాయిలు, కుర్మ రాజు, రతన్, నాయకులు సుమన్ గుప్తా, సుదర్శన్, సాయి, లక్ష్మణ్ గౌడ్, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

నవీపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్, శివతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బాలికలు సంక్రాంతి ముగ్గులు వేశారు. బాలురు హరిదాసు, గంగిరెద్దుల ఆడించే వ్యక్తి వేషధారణ ధరించి అందరినీ ఆకట్టుకున్నారు. గాలిపటాలను సైతం ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీదీప్, శివకుమార్, నాళేశ్వర్ మాజీ సర్పంచ్ సరిన్, ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని పలు విద్యాలయాల్లో శుక్రవారం మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ముగ్గుల పోటీలు, పతంగిల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఆనందంగా పాల్గొన్నారు. మండలకేంద్రంలోని శ్రీవిద్యాసాయి ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

పెర్కిట్: మామిడిపల్లిలో గల నలంద పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు రంగురంగుల ముగ్గులు వేసి అలరించారు. అదే విధంగా విద్యార్థులు గాలిపటాలు ఎగురవేశారు. మహిళ ఉపాధ్యాయునీలు పంటలు సమృద్ధిగా ప్రజలు సంతోషంగా ఉండాలని ఘనంగా సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సాగర్, ప్రసాద్ పాల్గొన్నారు.

నియో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో..

నందిపేట: మండల కేంద్రంలోని నియో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిన్న పిల్లలకు ఉపాధ్యా యులు భోగి పండ్ల కార్యక్రమం నిర్వహించారు. బాలికలు ముగ్గులు వేసి అందర్నీ అబ్బురపరిచారు. బాలురు గాలిపటాలు ఎగుర వేశారు. చిన్న పిల్లలు గాలి పటాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోజూరి అరుణ్, ప్రిన్సిపాల్ రవి కిరణ్, ఉపాధ్యాయులు సిబ్బంది ఉన్నారు.

పడిగెల పాఠశాలలో..

వేల్పూర్: మండలంలోని పడిగెల పాఠశాలలో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని శుక్రవారం విద్యార్థినిలకు ముగ్గుల పోటీలు, విద్యార్థులకు పతంగి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రాంచందర్, ఉపాధ్యాయులు శంకర్, నారాయణ, శ్రీనివాస్, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నాళేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

సంస్కృతి, సంప్రదాయాలపై మక్కువ చూపేలా చూడాలి

బోధన్‌రూరల్: విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలపై మక్కువ చూపేలా చూడాలని శ్రీసాయి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ పూదోట జయప్రకాష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీసాయి ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలలో భాగంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు రంగురంగుల ముగ్గులతో పాఠశాల ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. భోగిపండ్లు, భోగి మంటలతో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యావికాస్ వ్యవస్థాపకులు శ్రీనివాస్, ఉషోదయ డైరెక్టర్ సునీత, ప్రైవేటు విద్యాసంస్థల బోధన్ అధ్యక్షుడు హరికృష్ణ, పాఠశాలల ప్రతినిధులు జయప్రకాష్ పాల్గొన్నారు.

జానకంపేట పాఠశాలలో..

ఎడపల్లి: మండలంలోని జానకంపేట గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలను రంగుల ముగ్గులతో అలంకరించి, గాలి పటాలను ఎగురవేశారు. అనంతరం భోగిమంటలు వేసి విద్యార్థులు సంతోషంగా పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోన్స్ మాట్లాడుతూ విద్యార్థులకు సంక్రాంతి యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ వేడుకలను నిర్వహించడం జరిగిందన్నారు.

ఘనంగా హిందీ భాష దినోత్సవం

డొంకేశ్వర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విశ్వహిందే దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 2006 జనవరి 10వ తేదీన హిందీ సమ్మేళనంలో భారత ప్రభుత్వం హిందీ భాష దినోత్సవంగా జరుపుకోవాలని గుర్తించిందని పాఠశాల హెచ్‌ఎం సురేష్‌కుమార్, ఉపాధ్యాయుడు గంగాధర్ విద్యార్థులకు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాసం, కవిత పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్‌కుమార్, గంగారెడ్డి, సదానంద్, వెంకటరమణచారి, సాయికుమార్, సాగర్, రవి, కిరణ్, రాజేశ్వర్, సాయిలు, రాణి, అలివేణి, మంగమ్మ, విజయలక్ష్మీ, చంద్రకళ, లావణ్య, రోజా, తదితరులు పాల్గొన్నారు.

కోనాపూర్ విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ

కమ్మర్‌పల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండంలో కోనాపూర్ విద్యార్థులకు (క్రీడాకారులకు) శుక్రవారం గ్రామానికి చెందిన నల్ల గంగాధర్ క్రీడాదుస్తులను వితరణ చేశారు. ఈ క్రీడాకారులు జగాత్యాల జిల్లా కథలాపూర్ మండలం ఊట్‌పల్లి లో కరీనగర్ నిజామాబాద్ ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహింపబడే క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు, ఈ క్రీడల్లో విద్యార్థులు తమ క్రీడా ప్రతిభను కనబర్చి ఉత్తమ క్రీడాకారులుగా రాణిస్తూ గ్రామం పేరును నిలపాలని దాత గంగాధర్ ఆకాంక్షించారు.

అంకాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఆర్మూర్‌రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో శుక్రవారం సీసీ రోడ్డు పనులను వీడీసీ అధ్యక్షుడు సల్ల మోహన్‌రెడ్డి ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.20లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. నిధుల మంజూరు చేసిన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీకార్యదర్శి సాగర్, సుర్బిర్యాల్ రాజారెడ్డి, బద్దం నర్సారెడ్డి, పైడి రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

పెర్కిట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రక్ష స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అవ్వకు బువ్వ కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాదాపు 56మంది పేద వృద్ధులు ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున పంపిణీ చేశారు. రక్ష స్వచ్ఛంద సేవ సంస్థ తరఫున త్వరలో హెల్త్‌క్యాంప్ నిర్వహిస్తామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఖాందేశ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధానకార్యదర్శి విద్యాప్రవీన్‌పవార్, ఉపాధ్యక్షుడు జిందం నరహరి, విద్యగోపికృష్ణ, కోశాధికారి గొనే శ్రీధర్, కార్యనిర్వహణ కార్యదర్శులు బేతు గంగాధర్, ఖాందేశ్ సత్యం, తులసీపట్వారి, సభ్యులు శరత్, విష్ణు, చైతన్య, కళ్యాణ్, సాయి, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

డొంకేశ్వర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారంపల్లి గ్రామానికి చెందిన ఆరే స్వప్నకు రూ.30వేలు, సిర్పూర్ గ్రామానికి చెందిన చుక్క రత్నాబాయికి రూ.52వేల 500, నూత్‌పల్లికి చెందిన మోర్తాడ్ రవికి రూ.19వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కాగా శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడిసెరం భూమేష్‌రెడ్డి పంపిణీ చేశారు.

నందిపేట: మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామంలో శుక్రవారం బాధిత కుటుంబాలకు ఆర్మూర్ నియోజకవర్గం ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, ఆర్మూర్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్ అందజేశారు. ఆస్పత్రిలో అనారోగ్యంతో బాధ పడుతున్న బైండ్ల గంగాధర్‌కు రూ.60వేలు చెక్కును అలాగే బ్యాగరి లక్ష్మికి రూ.12వేల చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు నంగి గంగాధర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుండు హరీష్, మాజీ సర్పంచ్ మంగ్లారపు ధర్మన్న, పీఏసీఎస్ డైరెక్టర్ తోట మహేష్ ఉన్నారు.

విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు..

కమ్మర్‌పల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో నర్సాపూర్ గ్రామ పాఠశాల విద్యార్థులకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైటింగ్ ప్యాడ్లు, పెన్నులు, పండ్లు, పాఠశాలకు వైట్‌బోర్డులు అందజేశారు. అమ్మా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల పురందర్ తన కుమారుడి పడాల స్వాతిక్ జన్మదిన సందర్భంగా వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేందర్, ఉపాధ్యాయులు రాజ్ పండరి, దిలీప్ కుమార్, కావ్య, పద్మసౌజన్య, రుచిత, సంజన పాల్గొన్నారు.

మోతెలో వరి సాగు విధానంపై అవగాహన

వేల్పూర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం మోతె గ్రామంలోని రైతు వేదికలో శుక్రవారం డాక్టర్ రేడ్డిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు వరిసాగులో తడిపొడి పద్దతి గురించి అవగాహన కల్పించారు. వరి నాటిన నుంచి కోతకు వచ్చే వరకు పాటించాల్సిన తడిపొడి పద్దతులతో పాటు చీడపీడల పురుదల నివారణ వంటి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో షబ్బీర్, డాక్టర్ రెడ్డిస్, సీఎఫ్ చింత శ్రీనివాస్, సనుత్న, మహేందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపజేయాలి

కోటగిరి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీని ఎలాంటి ఆంక్షలు లేకుండా వర్తింపజేయాలని బీజేపీ నాయకులు నాగం సాయిలు డిమాండ్ చేశారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ గంగాధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా పథకానికి ఎకరానికి 15వేల రూపాయలు, కౌలు రైతులకు ఎకరానికి 12వేలు, పంట బీమా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నవీన్, శ్యామల, రవి పాల్గొన్నారు.




హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్ పోటీలో ముగ్గులు వేస్తున్న మహిళలు



పోటీలో పాల్గొన్న మహిళలతో సినీనటి వైష్ణవీ చైతన్య

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ రాష్ట్ర స్థాయి ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్స్



ముగ్గు వేస్తున్న సినీ నటి వైష్ణవీ చైతన్య

ముత్యాల ముగ్గులు నేలమ్మను పలకరించాయి. చుక్కలతో వేసిన రంగవల్లుల మధ్య గొబ్బెమ్మలు.. చెరుకుగడలు.. పిండి వంటల అలంకరణలతో సంక్రాంతి శోభను ముందే తెచ్చాయి. ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) తెలంగాణ రాష్ట్ర స్థాయి ఫైనల్స్ పోటీలు హైదరాబాద్‌లోని సనత్‌నగర్ జీహెచ్‌ఎంసీ మున్సిపల్ గ్రౌండ్‌లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా శుక్రవారం జరిగాయి. విజేతలకు ముఖ్య అతిథులు సినీనటి వైష్ణవీచైతన్య, సినీనటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్ బహుమతులను అందజేశారు.




పోటీలో రంగవల్లులు వేస్తున్న మహిళలు



ముగ్గు వేస్తున్న మహిళ



బహుమతుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న సినీ నటుడు వడ్లమాని సాయి శ్రీనివాస్, చిత్రంలో న్యాయ నిర్ణేతలు పి. రజని, డాక్టర్ పి. శ్రీలక్ష్మి, నటి వైష్ణవీ చైతన్య, సంతూర్ హైదరాబాద్ ఏరియా మేనేజర్ సంజీవ్ మోదీ, ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్

పాఠశాలల్లో ఘనంగా ముందస్తు సంక్రాంతి

కామారెడ్డి జిల్లావ్యాప్తంగా పలు పాఠశాలల్లో విద్యార్థులు సంక్రాంతి ముందస్తు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన వేడుకలు ఆద్యాంతం సంస్కృతి, సంప్రదాయాలు, అచార వ్యవహారాలను ప్రతిబింబించేలా పాఠశాలల్లో పలు కార్యక్రమాలు, ప్రదర్శనలు కొనసాగాయి. ఆయా పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. విద్యార్థినులు తెలుగుదనం ఉట్టిపడేలా దుస్తులు ధరించి పాల్గొన్నారు. హరిదాసు, రైతుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.



మాచారెడ్డిలో ముగ్గులు వేస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



భిక్కనూరులోని సిద్ధార్థ పాఠశాలలో భోగి మంటలు వేస్తున్న దృశ్యం



బ్రిలియంట్ పాఠశాలలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు

● అక్షరలో పాఠశాలలో..

కామారెడ్డిటౌన్, జనవరి10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పం డుగను పురస్కరించుకుని కా మారెడ్డి జిల్లాకేంద్రంలోని అక్ష ర ఉన్నత పాఠశాలలో శనివా రం సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. పా ఠశాల ఆవరణలో చిన్న కుటిరాలు ఏర్పాటుచేసే పచ్చనైన పల్లె వాతావరణాన్ని సృష్టించి వేడుకలను జరిపారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ముగ్గుల పోటిలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పా ఠశాల చైర్మన్ అశోక్‌రెడ్డి, కరస్పాండెంట్ లోకేష్‌రెడ్డి, ప్రిన్సిపల్ సరితారెడ్డి,ఉపాధ్యాబృందం పాల్గొన్నారు.

● ప్రభుత్వ పాఠశాలలో ముగ్గుల పోటీలు

మాచారెడ్డి, జనవరి10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మాచారెడ్డి మండలం సోమారంపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సంబరాలు నిర్వహించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాల ఆవరణలో విద్యార్థినిలు రంగురంగుల ముగ్గులను వేసి కళానైపుణ్యాన్ని ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, పోశెట్టి, సంతోష, సంధ్య, రజిత తదితరులు పాల్గొన్నారు.

● బీర్కూర్ పాఠశాలలో..

బీర్కూర్, జనవరి10(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బీర్కూర్ మండలంలోని వివిధ పాఠశాలల్లో శుక్రవారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. బీర్కూర్ మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాటశాలలో ఉపాధ్యాయులు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఫణిశ్రీ, ఉపాధ్యాయులు రాజు పాల్గొన్నారు.



అక్షర పాఠశాలలో వివిధ వేషధారణలో విద్యార్థులు

● ఎల్లారెడ్డిలోని పాఠశాలల్లో

ఎల్లారెడ్డి, జనవరి10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులందరూ సాంప్రదాయ వస్త్రాదారణాలు ధరించి రంగవల్లులు గాలి పటాలు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

● అచ్చంపేట పాఠశాలలో పోటీలు

నిజాంసాగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలం అచ్చంపేట గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థి విద్యార్థులకు ముగ్గుల గాలి పటాల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకట్రాంరెడ్డి, టీఆర్టీ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లాల్‌సింగ్, ఉపాధ్యాయులు జోసఫ్, సాయిప్రసాద్, మౌనిక, తదితరులున్నారు.

● సిద్దార్థ పాఠశాలలో..

భిక్కనూరు, జనవరి10(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సిద్ధార్థ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినీలు, ఉపాధ్యాయులు తీరొక్క ముగ్గులువేసి వాటిని రంగులతో అందంగా తీర్చిదిద్దారు. అనంతరం ప్రైమరీస్థాయి విద్యార్థులకు నేరేడుపండ్లు పోసిపాలు పొంగించి బోగిమంటలు వేశారు. సంక్రాంతి విశిష్టతను పాఠశాల కరస్పాండెంట్ సుధాకర్ వివరించగా, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



ముగ్గుల పోటీలో పాల్గొన్న బాలికలు

గ్రామీణస్థాయిలో క్రీడా పోటీలు అభినందనీయం

● క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని కొత్తబాద్ గ్రామంలో నిర్వహిస్తున్న కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్ర వారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ ప్రార ంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడాపోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని, గ్రామీణస్థాయి క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్రికెట్ టోర్నీలు ఎంతో దోహద పడతాయని అన్నారు. క్రీడాకలరులు తమ ప్రతిభను వెలికితీయాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, అంజి రెడ్డి, శ్రీధర్, జిల్లా యువజన అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, యువజన అ ధ్యక్షులు మన్సూర్, సాయిరెడ్డి, సాయిలు, షాదుల్, జీవన్, పాల్గొన్నారు.



కొత్తబాదిలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఆగ్రో చైర్మన్ కాసుల బాల్‌రాజ్



బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంటి ముందు బైఠాయించి నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు



పెద్దకొడప్‌గల్ మండలకేంద్రంలో తహసీల్దార్ హిమబిందుకు వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు



ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడికి వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

ఆశా వర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలి

● బాన్సువాడలో ఎమ్మెల్యే ఇంటి ముందు బైఠాయింపు


బాన్సువాడ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంటి ముందు ఆశా వర్కర్లు బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఖలీల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని చెప్పి సంవత్సరం గడిచిన ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఎటువంటి అడుగులు వేయలేదని, సమస్యలను పరిష్కరించలేకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యచరణ చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పల్లవి, సుజాత విజయలక్ష్మి, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి

పెద్దకొడప్‌గల్: నియోజకవర్గంలో ఉన్న ఆశ కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కరించాలంటూ చేస్తున్న ఆందోళన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జుక్కల్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ తమకు రూ.18 వేల వేతనం చెల్లించడంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటుగానే ఏఎన్‌ఎం శిక్షణ పూర్తి చేసిన ఆశ కార్యకర్తలకు రెగ్యులర్ ఏఎన్‌ఎంలుగా ప్రమోషన్ కల్పించాలని, ఆశలకు గతంలో ఇచ్చిన హామీ ప్రకారం రూ.50 లక్షల బీమా కల్పించాలన్నారు. సంవత్సరానికి గాను 20 రోజుల వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని, గత ప్రభుత్వ హామీ ప్రకారం ప్రసూతి సెలవులివ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ఆశలకు పని చేసిన పల్స్‌పోలియో పనులతో పాటు, లెప్రసీ సర్వే చేసిన పనిదినాల భత్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశలకు పనిభారం తగ్గించడంతో పాటు పారితోషకం లేని పనులు చేయించకూడదని పేర్కొన్నారు. ఆశల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి సీపీఎం నాయకులు మద్దతు ప్రకటించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ హిమబిందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి రాగా.. ఆమెకు వినతిపత్రం అందజేశారు.

● వినతిపత్రం ఇచ్చిన ఆశా వర్కర్లు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కురుమ సాయిబాబాకు ఆశా వర్కర్లు వినతిపత్రం సమర్పించారు. ఆశాల సమస్యలను ఎమ్మెల్యే ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి అందజేయాలని కోరారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలోల ఫిక్స్‌డ్ వేతం 18 వేల రూపాయల ప్రకటనతో పాటు ఇతర సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించే విధంగా చూడాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. అంతేకాకుండా ఏఎన్‌ఎం శిక్షణ పూర్తి చేసిన ఆశ కార్యకర్తలకు రెగ్యులర్ ఏఎన్‌ఎంలుగా ప్రమోషన్ కల్పించాలని, అలాగే ఆశలకు గతంలో ఇచ్చిన హామీ ప్రకారం రూ.50 లక్షల బీమా కల్పించాలని ఆయన అన్నారు. సంవత్సరానికి గాను 20 రోజుల వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని, గత ప్రభుత్వ హామీ ప్రకారం ప్రసూతి సెలవులివ్వాలంటూ పలు డిమాండ్లు వ్యక్తం చేశారు.



భూభారతితో చిక్కులు తొలిగేనా!?

(5వ పేజీ తరువాయి...)

వ్యవస్థ ప్రక్షాళనతో గ్రామస్థాయిలో పనిచేసే వీఆర్‌వోలు, వీఆర్‌ఏలను ఆయా శాఖల్లో వీలినం చేశారు. జిల్లాలో రెవెన్యూ వ్యవస్థను రద్దు చేసే సమయానికి వీఆర్‌వో, వీఆర్‌ఏలు పనిచేసేవారు. వీఆర్‌వోలను ఆయా శాఖలల్లో వీలినం చేశారు. అర్హత గల వీఆర్‌ఏలను పేస్కేల్ వర్తింపజేస్తూ.. ఆయా శాఖల్లో జూనియర్ అసిస్టెంట్‌లుగా అర్హతలేనివారిని నీటిపారుదల శాఖలో నీరడిలుగా నియమించారు. 60 ఏళ్లకు చేరువలో ఉన్న వారి విషయమై ప్రస్తుతానికి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం తీసుకువస్తున్న బిల్లులో గ్రామానికో రెవెన్యూ కార్యదర్శిని నియమిస్తామని ప్రభుత్వం చెబుతుంది. గ్రామస్థాయిలో జరుగుతున్న ఆయా అంశాలతో పాటు శాంతిభద్రతలు, ఇతరత్రా అంశాలు రెవెన్యూ శాఖకు బదిలీ కానున్నాయి. దీంతో మరోసారి రెవెన్యూ వ్యవస్థ పటిష్టం కానుందంటున్నారు.

పారదర్శకత పెరిగే అవకాశం

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలులోకి తీసుకురానున్న కొత్త ఆర్‌వోఆర్ చట్టంతో భూ సమస్యల పరిష్కారంలో పారదర్శకత నెలకొంటుందని దళారుల వ్యవస్థ అరికట్టవచ్చని పలువురు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అన్నిరకాల సేవలకు కలెక్టర్‌లతో ముడిపడి ఉండగా.. తాజా చట్టంతో తహసీల్ధార్‌లకు, ఆర్‌డీవోలకు బదలాయింపును కేటాయించారు. ముఖ్యంగా మ్యూటేషన్, సాదాబైనామా, ఓఆర్‌సీ అప్పీలింగ్‌కు సంబంధించిన అంశాలను ఆర్‌డీవోలకు అందించనుండగా.. పౌతి, విరసత్‌తో పాటు మరికొన్ని అంశాలను తహసీల్దార్‌లకు అప్పగించనున్నారు. ఇక కలెక్టర్ స్థాయిలో ఇప్పటి వరకు ఉన్న పనిభారం ఆర్‌డీవోలకు, తహసీల్ధార్‌లకు ఆయా అంశాలు బదిలాయించడంతో కలెక్టర్‌లపై పనిభారం తగ్గనుంది. ఇప్పటి వరకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్న సివిల్ కోర్టుకు వెళ్లాల్సి ఉండగా.. ప్రస్తుతం తహసీల్ధార్ స్థాయిలో జరిగిన తప్పిదాలపై ఆర్‌డీవో స్థాయిలో.. అక్కడ న్యాయం జరగని పక్షంలో అదనపు కలెక్టర్ స్థాయిలో అప్పీలింగ్ వ్యవస్థను తీసుకురానున్నారు. ఈ వ్యవస్థ లేకపోవడంతో ధరణి పోర్టల్ వచ్చినప్పటి నుంచి అనేక కేసులు నమోదైనట్లు రెవెన్యూ రికార్డుల ద్వారా తెలుస్తుంది.

గొర్రెల కాపరిని బడిలో చేర్చిన సీఆర్పీలు



తుంకిపల్లి తండాలో బడి మానివేసిన బాలికతో సీఆర్పీలు వెంకట రామాగౌడ్, శంకర్

నిజాంసాగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ఉమ్మడి మండలంలోని కొములంచ గ్రామంలో బడి మానివేసి గొర్రెల కాపరిగా మారిన గొలుసుల విజయను శుక్రవారం సీఆర్పీలు గుర్తించారు. మహ్మదనగర్ మండలంలోని తుంకిపల్లి తండాకు చెందిన గొలుసుల విజయగా గుర్తించి బడికి పంపేందుకు ఆమె తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సంక్రాంతి సెలవులు పూర్తి కాగానే అమ్మాయిని బడిలో చేర్పిస్తామని సీఆర్పీలు శంకర్‌గౌడ్, వెంకట్రామాగౌడ్‌లు తెలిపారు. కొమ్మలంచలో విజయ, గొరైల కాపరిగా ఉంచుకున్న యజమానికి కౌన్సిలింగ్ చేశారు. బడిలో ఉండే బాలికలను పాడేరులుగా మారిస్తే కఠిన చర్యలు తప్పవని వారన్నారు.

నేడు తలమడ్లలో వాలీబాల్ టోర్నమెంట్

రాజంపేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలమడ్ల గ్రామంలో శనివారం కర్నాల శ్రీనాథ్ స్మారకార్థం ఓపెన్ టూ వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవం చేపట్టనున్నట్లు నిర్వహక సభ్యులు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుండి వివిధ జట్లు పాల్గొంటున్నాయని తెలిపారు. శని,ఆదివారాలలో జరుగుతాయని ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదని తెలిపారు. మొదటి విజేతకు రూ.15వేలు, రెండో విజేతకు రూ.10 వేలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మిగిలిన వివరాల కోసం సెల్ నెం.9705222767, 9640784572 ద్వారా సంప్రదించాలని వారు ఈ సందర్భంగా తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

రాజంపేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్గొండ గ్రామంలో శుక్రవారం కామారెడ్డి పీఎఫ్ఎల్(ఎస్ఎస్‌టీ) స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పీఎంఎస్‌బీవై,పీఎంజేజేబీవై కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలపై, బ్యాంకింగ్ సేవలపై,సైబర్ మోసాలపై అవగాహన కల్పించినట్లు ఎస్ఎస్‌టీ స్వచ్ఛందసంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీలు సాయిలు, కౌన్సిలర్‌లు రాజు,ఆనంద్‌రెడ్డి, వీవోఏ ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ప్రతీనెల 1న పరిశుభ్రత కార్యక్రమం ఏర్పాటు చేయాలి

దోమకొండ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ,ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రతీనెలలో ఒక్కసారి ఉపాధి హామీ కూలీలతో పరిశుభ్రత కార్యక్రమం ఏర్పాటు చేయాలని శుక్రవారం మాజీ జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ దోమకొండలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి హజరైన ఏపీడీ వామన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. అందువలన ప్రభుత్వ పాఠశాలలు శుభ్రంగా ఉంటాయని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమం అమలు అయ్యేవిధంగా కృషి చేయాలన్నారు. ఇందులో ఏఎంసీ డైరెక్టర్ కదిరే గోపాల్‌రెడ్డి, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.



ఏపీడీ వామన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

● బీజేపీ మండల నాయకుల డిమాండ్ ● భిక్కనూర్, మద్నూర్‌లలో తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేత



భిక్కనూరులో తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం



మద్నూర్‌లో తహసీల్దార్‌కు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న నాయకులు

భిక్కనూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని ఎలాంటి షరతులు విధించకుండా వెంటనే అమలు చేయాలని బీజేపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలశాఖ ఆధ్వర్యంలో ఎన్నికల హామీలను ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పరి రమేష్ మాట్లాడుతూ రైతు రుణమాఫీ చేస్తామని, రూ.15వేలు రైతుబంధు, కౌలు రైతులకు యేటా రూ.12వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా.. ఇప్పటికీ ఇవ్వకుండా రైతులను మోసం చేస్తుందని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనియెడల రైతులకు అండగా బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుమలేష్, రమేష్‌రెడ్డి, ప్రమీలా, లింగారెడ్డి, నరేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, లక్ష్మీ, రాకేష్, ప్రవీణ్‌చారీ, చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

● రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిన ప్రభుత్వం

మద్నూర్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిందని మద్నూర్ మండల బిజెపి నాయకులు తహసీల్దార్ ముజీబ్‌కు ఫిర్యాదు చేశారు. రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తున్న నేపథ్యంలో భారతీయ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతుల పక్షాన రైతులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రకారం రూ.2లక్షల రుణమాఫీ కల్పించాలని, రైతు భరోసా అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తుకారాం, ఎస్సీ మోర్చా నాయకులు వెంకట్ కాలే, నాయకులు యాదవ్, శివాజీ, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

రాజంపేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన పలు గ్రామాలలో శుక్రవారం కళ్యాణలక్ష్మీ, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్‌రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు లబ్ధిదారులకు గడప గడపకు వెళ్లి చెక్కులు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు సల్మాన్, సీనియర్ అధ్యక్షుడు శ్యామయ్య, శ్రీధర్, బన్సీలాల్, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పిట్లం: స్థానిక మార్కెట్ యార్డ్ కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్ అందజేశారు. ఇందులో ఏఎంసీ వైస్ చైర్మన్ కిష్టారెడ్డి, మండల అధ్యక్షుడు హన్మాండ్లు, నాయకులు రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, సాయిరెడ్డి, మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఏవో సేవలు అభినందనీయం'

నాగిరెడ్డిపేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారి విజయ్ శేఖర్ గత ఏడేళ్లుగా మండల రైతులకు అందించిన సేవలు ఎంతో అభినందనీయమని మండల కాంగ్రెస్ పార్టీ నేతలు, బీఆర్‌ఎస్ పార్టీ నేతలు కొనియాడారు. గత ఏడేళ్ల మండలంలో వ్యవసాయ అధికారిగా పనిచేసి ఇటీవలే బదిలీపై నిజామాబాద్‌కు వెళ్తున్న విజయ్‌శేఖర్‌ను శుక్రవారం మండల నాయకులు రైతు వేదికలో ఘనంగా సన్మానించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ విజయ్‌శేఖర్ రైతులకు ఎనలేని సేవలు అందించారన్నారు. అలాగే బదిలీపై వెళ్తున్న ఏఈవో నిఖితను సైతం ఘనంగా సన్మానించారు. ఇందులో మాల్ తుమ్మెద సొసైటీ అధ్యక్షులు నర్సింలు, మండల కాంగ్రెస్ నాయకులు రామచంద్రారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారెడ్డి, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు సిద్దయ్య, నాయకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నిజాంసాగర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డేపల్లి, మల్లూరు బంజపల్లి, అచ్చంపేట గ్రామాలలో 12 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను శుక్రవారం నిజాంసాగర్, పిట్లం, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కార్యాలయాల ఆవరణలో కల్యాణలక్ష్మీ చెక్కులను మార్కెటింగ్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్, ఉపాధ్యక్షులు మారేడు కృష్ణారెడ్డిల చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. మండలంలోని అచ్చంపేట, మల్లూరు, వడ్డేపల్లి, బంజపల్లి గ్రామాలలోని 12 మంది లబ్ధిదారులకు రూ.లక్షా 116 నగదు చెక్కులను అందజేశారు. ఇందులో నిజాంసాగర్, పిట్లం, మహ్మద్‌నగర్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హన్మాండ్లు, రవీందర్‌రెడ్డి, మల్లికార్జున్, సీనియర్ నాయకులు రామ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, తహసీల్దార్ భిక్షపతి, తదితరులున్నారు.

విద్యార్థి ఆకాష్‌కు ప్రశంసలు

నిజాంసాగర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఈనెల 7, 8, 9వ తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి ప్రదర్శనలో ఇన్స్‌పెక్టర్ మనక్ కార్యక్రమంలో అచ్చంపేట ఆదర్శ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఆకాష్ పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో విద్యార్థి ఆకాష్ విత్తనాలు నాటే యంత్రాన్ని తయారు చేసి ప్రదర్శనలో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ నరసింహా హాజరై వితతనాలు నాటే యంత్రాన్ని పరిశీలించారు. విద్యార్థి ఎంతో నైపుణ్యతతో విత్తనాలు నాటే యంత్రాన్ని తయారు చేయడం పట్ల ప్రశంసించారు. ఆదర్శ పాఠశాలలో విద్యాభ్యాసం చేసే ఆకాష్ జాతీయ స్థాయిలో ప్రదర్శన పోటీలకు ఎంపిక చేశారు. దీంతో విద్యాలయ ప్రిన్సిపాల్ సంధ్య, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని ప్రశంసించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ ఎస్ జైపాల్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.



రైతులకు పాలపదార్థాల తయారీపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

రైతులకు స్వయం ఉపాధిపై శిక్షణ

కామారెడ్డి టౌన్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని డెయిరీ కళాశాలలో డీఆర్‌డీఏ, ఎస్‌బీఐ, ఆర్‌ఎస్‌ఈటీఐ ఆధ్వర్యంలో పాడిపరిశ్రమ, పాలు, పాల ఉత్పత్తుల తయారీ, విక్రయాలపై యువ రైతులకు శుక్రవారం స్వయం ఉపాధి శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులు పాలు, పాడి, పాల పదార్థాల తయారీ గురించి తెలుసుకొని స్వతహగా డెయిరీ ఫామ్, పార్లర్, యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. 35శాతం సబ్సిడీతో కూడిన బ్యాంక్‌లోను కూడా ఇవ్వడంతో రైతులు వ్యాపారవేత్తగా మారి పాల పదార్థాలను మార్కెట్‌లోకి ఉత్పత్తి చేసినట్లయితే మార్కెట్‌లో నాణ్యమైన పాల పదార్థాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.ఈ శిక్షణలో పాల్గొనాలంటే 100 రోజుల ఉపాధి హామీ పూర్తిచేసి ఉండాలని తెలిపారు. ఇందులో ఏపీడీ హెడ్ మురళీకృష్ణ, పశు సంవర్ధక శాఖధికారి సంజయ్‌కుమార్, జేడీఎం రవీందర్, డీన్ ఉమాపతి, టీచింగ్‌స్టాఫ్ శరత్‌కుమార్, కోఆర్డినేటర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాలకృత్యాలకు వెళ్లి మహిళ మృతి

నాగిరెడ్డిపేట, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కాలకృత్యాలకు వెళ్లి మహిళ ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన మండలంలోని తాండూర్ గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ గ్రామానికి చెందిన చాకలి జమున(45) గురువారం రాత్రి కాలకృత్యాలకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో ప్రమా దవశాత్తు కాలు జారీ బండపైన పడడంతో తలకు తీవ్ర గాయమై మృతి చెం దినట్లు ఎస్సై తెలిపారు. శుక్రవారం మృతురాలి కుమారుడు చాకలి రాజు ఫి ర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డిగ్రీ కళాశాల సిబ్బందితో సమావేశం

మద్నూర్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మద్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ అశోక్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల డిగ్రీ కళాశాలకు ఐదు అధ్యాపక పోస్టులను మంజూరు చేసిందని. విద్యార్థులకు సరైన న్యాయం చేయాలని డిగ్రీ కళాశాలలో ఉత్తీర్ణశాతం పెంచాలని సూచించారు. వచ్చే విద్య సంవత్సరానికి గాను డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా అధ్యాపకులు కృషి చేయాలని పేర్కొన్నారు. ఇటీవల కాంట్రాక్ట్ బేసిక్ పై ఎంపికైన ఐదుగురు అధ్యాపకులు విద్యార్థులకు అందుబాటులో ఉంటారని సూచించారు.

● అధ్యాపకుల నియామకంపై హర్షం

మద్నూర్ డిగ్రీ కళాశాలకు జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు అధ్యాపకులను నియమించడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మద్నూర్ మండల కేంద్రానికి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు కానీ సిబ్బందిని నియమించకపోవడంతో అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించిన ఎమ్మెల్యే జిల్లా అధికారులతో మాట్లాడి కాంట్రాక్టు బేసిక్‌పై అధ్యాపకులను నియమించారని పేర్కొన్నారు. తమవంతుగా కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి కృషి చేస్తామని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సాయిలు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, తదితరులున్నారు.

కౌమార దశపై విద్యార్థులకు అవగాహన

ఎల్లారెడ్డి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో కౌమార దశలో వచ్చే మార్పుల గురించి గురువారం ఎల్లారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వర్డ్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కౌన్సిలర్ సాయిబాబా అవగాహన కల్పించారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులు కౌమార దశలో వచ్చే మార్పులను గమనించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. పిదప విద్యార్తులకు క్విజ్ పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం విజేతలకు బహుమతులను అందజేశారు.

స్థానిక ఎన్నికల్లో యువమోర్చా పాత్రకీలకం

● మండల అధ్యక్షుడు కుంటరాంరెడ్డి

సదాశివనగర్,జనవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ యువమోర్చా ప్రముఖ పాత్ర పోషించి బీజేపీ సత్తాచాటలని మండల అధ్యక్షుడు కుంటరాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేవైయం మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ నాయకులు అన్ని గ్రామాలలో నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి పథకాలు,దేశం కోసం పాటుపడుతున్న తీరు గడపగడపకు తీసుకెళ్లాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇప్పటి నుండే కార్యకర్తలను సమన్వయం చేస్తు ఓటర్ల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుంటూ సమస్య ఉన్న దగ్గర పోరాటాలకు కూడా వెనుకాడకుండా ముందుకు సాగాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేవైయం మండల అధ్యక్షుడు దొడ్లకృష్ణారావు, ప్రధానకార్యదర్శి సంజీవరెడ్డి, రామకృష్ణ,వంశీ,నవీన్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి	
శాంతి	రోటి కప్‌డా రోమాన్స్
దర్శన్	యూఐ
ప్రియా 70	పుష్ప-2
ప్రియా 35	గేమ్ చేంజర్
బాన్సువాడ	
మహేశ్వరి	పుష్ప-2
వేంకటేశ్వర	మ్యాక్స్



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	120	140	160
వెన్‌కాబ్(కిలో)	130	160	190

